వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గల వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ పరిధిలోని పెదగదిలి వద్ద వీధి కుక్కలకు యాంటీ రబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జీవీఎంసీ వెటర్నరీ డాక్టర్ ఎన్. కిషోర్ కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ నగరంలోని వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని, శనివారం పెదగదిలి వద్ద 52 వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేసి రేబిస్ నిర్మూలన టీకా కార్యక్రమం నిర్వహించడమైనదన్నారు. ఇది నిరంతరం ప్రతి వార్డులో వేస్తున్నామన్నారు. తెలిపారు. అలాగే ప్రతి పి హెచ్ సెంటర్లో జీవీఎంసీ కార్మికుల తోపాటు ప్రజలకు రాబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వి.ఎస్.పి.సి.ఎ ప్రతినిధులు ప్రదీప్ రాజు, శారద జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణ, అవినీతి అంతం కోసం ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ చట్టం

ఆర్‌టిఐ సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ

విశాలాంధ్ర–విశాఖ సిటీ : మానవ హక్కుల సంరక్షణ, అవినీతి అంతం కోసం ఆర్ టీ ఐ హ్యూమన్ రైట్స్ చట్టం ఉందని ఆర్‌టిఐ సౌత్ ఇండియా చైర్మన్ ఆల్ఫా కృష్ణ పేర్కొన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఆర్‌టిఐ హ్యూమన్ రైట్స్ రాష్ట్రస్థాయి నియామక సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిని అంతం చేయడానికి వెనుకాడబోమని, ప్రజల సమస్యలపై పోరాడుతామని, ఎవరికి ఎటువంటి అన్యాయం జరిగిన ఆర్‌టీఐను సంప్రదించవచ్చు అని మీడియా ముఖంగా సమాజానికి తెలియజేస్తున్నాం అన్నారు. పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించి, బాధ్యతలకు సమాధానం అడిగే హక్కును కల్పిస్తుందని ఆర్టిఐ సూచిస్తుందన్నారు. ఈ చట్టం, సమాచారం కోసం ప్రజలకు ఒక మార్గాన్ని కల్పిస్తూ, అధికార దుర్వినియోగాన్ని నివారిస్తుందన్నారు. ప్రభుత్వాలను జవాబుదారీగా ఉంచడం,ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించడానికి బాధ్యతగల పౌరులుగా చేయగలుగుతుందన్నారు. ఆర్టిఐ ద్వారా సమాచార పారదర్శకత పెరిగి, ప్రజలు తమ హక్కులను వినియోగించు కోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. సమాచార హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజలు తమ హక్కులను కాపాడుకోవడానికి, వేధింపులకు గురైనప్పుడు, ఆసమాచారాన్ని ఉపయోగించి సహాయం పొందడానికి వీలుంటుందన్నారు.

పార్టీకి సోషల్ మీడియా కార్యకర్తలే కొండంత బలం

జిల్లా షోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కె రాజు

విశాలాంధ్ర–విశాఖ సిటీ : పార్టీకి సోషల్ మీడియా కార్యకర్తలే కొండంత బలం అని వైసిపి జిల్లా అధ్యక్షులు కె కె రాజు అన్నారు. శనివారం వైసిపి నగర కార్యాలయంలో జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన "జిల్లా షోషల్ మీడియా ఆత్మీయ సమావేశం" లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మొట్టమొదటిగా వైస్సార్సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు మీద తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. 2017నవంబర్ 6వ తేదీన ఇడుపులపాయలో ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర దగ్గర నుండి 2019 మే30 తేదీన వై.యస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినంత వరకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా అండగా ఉందన్నారు. షోషల్ మీడియా కార్యకర్తలుకు సంబంధించిన పోలీసు కేసులు, ఇతర సమస్యలను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకివెళ్లి పరిష్కరం అయ్యేవిదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో సోషల్ మీడియా కార్యకర్తల కష్టానికి తగిన ప్రతిఫలం ఉండే విదంగా నేను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ ఆఫీసు ఇంచార్జ్ రవిరెడ్డి, జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్ పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్ ఇమ్రాన్, జిల్లా సోషల్ మీడియా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళను మోసగించి రూ.97 లక్షలు వసూలు

మోసగించిన రౌడీ షీటర్, ఆయన భార్య అరెస్ట్

విశాలాంధ్ర–పీఎం పాలెం : ఆనందపురంలో దళిత మహిళను మోసగించి రూ.97 లక్షలు వసూలు చేసిన రౌడీషీటర్ మీసాల అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. దళిత మహిళ కుంచంగి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. 2000వ సంవత్సరంలో విశాఖపట్నం రామ్ టాకీస్‌కు చెందిన కుంచంగి లక్ష్మి (55) అనేకమంది మధ్యవర్తుల సాయంతో చందక పంచాయతీ పరిధిలోని 30సెంట్ల భూమిని కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. భూమి విలువ రూ.99 లక్షలు అని చెప్పగా, మీసాల అప్పలనాయుడు తప్పుడు పత్రాలతో దశలవారీగా రూ.97 లక్షలు తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్నాడు. భూమి రిజిస్ట్రేషన్ విషయంలో మాయమాటలు చెబుతూ తప్పించుకుంటూ తిరుగుతున్నాడని బాధితురాలు పేర్కొన్నారు. తన భర్త రిటైర్మెంట్ సొమ్ముతో భూమిని కొనుగోలు చేసిన లక్ష్మికి, భూమి రిజిస్ట్రేషన్ జరగకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఆమె భర్త సింహాద్రి, కుమారుడు మనోవేదనతో గుండెపోటుతో మృతి చెందినట్టు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మి క్యాన్సర్ రోగిగా ఉండి, ఒంటరిగా న్యాయపోరాటం చేస్తున్నారు. బాధితురాలు పోలీస్ స్టేషన్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, సీపీ కార్యాలయాల్లో అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. అంతేకాక, ఆమెకు మద్దతుగా ఉన్న పోలీసులపై, మిత్రులపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం 7:30 గంటల సమయంలో ఆనందపురంలో మీసాల అప్పలనాయుడు, ఆయన భార్య శ్రీదేవిలను అరెస్ట్ చేసిన పోలీసులు మధురవాడ ఏసీపీ కార్యాలయంలో విచారణ జరిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నంబర్ 95/2025గా నమోదు చేసిన పోలీసులు, బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా తదుపరి విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఇస్కఫ్ సారథి సుకుమారన్ ఉద్యమాలకు స్ఫూర్తి

సంస్మరణ సభలో అతిథుల ఘన నివాళి

విశాలాంధ్ర–విశాఖపట్నం : కమ్యునిస్టు యోధుడిగా, శాంతి సాంస్కృతిక ఉద్యమాల సారథిగా, స్నేహశీలిగా,సౌమ్యుడిగా టిఎస్ .సుకుమారన్ అందరి మన్ననలు పొందారని, నిజమేనా కమ్యూనిస్టుగా జీవితమంతా జీవనం సాగించారని, నిజమైన కమ్యూనిస్టుగా జీవనం సాగించారని వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, సిపిఐ నాయకులు , ఇస్కఫ్ నాయకులు టి.ఎస్. సుకుమారన్ ఇటీవల మరణించడంతో ఆయన సంస్మరణ సభ శనివారం డాబా గార్డెన్స్, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. యూపీఎస్సీ పూర్వ సభ్యులు, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆచార్య కె.యస్.చలం అన్నారు. ఇస్కఫ్ కార్యక్రమాల నిర్వహణలో ఆయన ఏకధాటిపై నడిపించే వారిని, జాతీయస్థాయిలో అనుబంధ సంఘాలను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య కె యస్ చలం ప్రసంగిస్తూ విశాఖలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగిన గుర్తుకు వచ్చే పేరు టి.ఎస్. సుకుమారన్ అని, ప్రతి కార్యక్రమంలోను ఆయన పాత్ర ఉండేది అన్నారు.ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ముందుకు నడవాలి అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజానికి తన వంతు ఏదో ఒకటి చేయాలని ఆత్రుత పడేవారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కళ్ళను సంస్కృతిని విశాఖపట్నం చేసిన ఘనత సుకుమారన్ దే అన్నారు. ఇది రాష్ట్రాల సాంస్కృతిక సమాఖ్యలను ఏకంచేసి అఖిలభారత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) ద్వారా దేశవ్యాప్తంగా ఎందరో నాయకులు, ప్రముఖులను విశాఖకు తీసుకు వచ్చివారితో ప్రసంగాలు ఇప్పించారన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాగితేలు రాజశేఖర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోను, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇస్కఫ్ కార్యకలాపాల్లోను, నిర్మాణంలోనూ ఆయన పాత్ర మరువలేనిది అన్నారు. ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పడిహారి మాట్లాడుతూ ఇస్కఫ్ ఉద్యమానికి సుకుమారుడు లేని లోటు తీర్చలేనిది అన్నారు. ముక్కు సూటిగా వ్యవహరించే ఆయన ఆశయాలు కొనసాగించా లన్నారు. ఇస్కఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ సభ్యులు కడారు ప్రభాకర్ రావు మాట్లాడుతూ సుకుమారన్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి పి బిజయ్ కుమార్, ఆచార్య బాల మోహన్ దాస్, పివిఎస్ మూర్తి, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సనపల నరసింహులు, క్షేత్ర పాల్ రెడ్డి, సిపిఐ ఫ్లోర్ లీడర్ స్టాలిన్, సిపిఐ నాయకులు ఎం.పైడిరాజు, ఎంఏ మాధవరావు, ఎం.మదుమతి, కె ఎస్ సురేష్ కుమార్, విబిసి సిఇఒ నర్సింహమూర్తి, ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి, ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ పిచ్చియ్య, ఇస్కఫ్ రాష్ట్ర నాయుకులు యస్‌వి రమేష్, లక్ష్మి గణపతి, యస్ సూర్యనారయణ, బి యస్ యస్ ఎల్ నాయుకులు రాజు, అరుణ్ కుమార్, ఆచార్య మంజులత, తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఇంజనీర్ మల్లికార్జునరావు సేవలు ఆదర్శనీయం : డిపిఆర్‌ఓ ఎస్.వి. రమణ

విశాలాంధ్ర–విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్‌గా ఉత్తమ సేవలు అందిస్తూ శాఖ ఖ్యాతిని పెంచిన సీహెచ్. మల్లికార్జునరావును జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ హృదయపూర్వకంగా అభినందించారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. మల్లికార్జునరావు 33 సంవత్సరాల సుదీర్ఘ సేవలో ఎల్లప్పుడూ నిబద్ధతతో, సంయమనంతో విధులు నిర్వహించారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విభజన అనంతర ఆంధ్రప్రదేశ్ వరకు రెండు రాష్ట్ర అసెంబ్లీ లలోనూ తన పనితనంతో ఆదర్శంగా నిలిచిన మల్లికార్జునరావు, ప్రతి అంశంలోనూ తనదైన శైలిలో నిపుణతను ప్రదర్శించారని, ముక్కుసూటి ధోరణితో సహవాసులను ఆకట్టుకున్నారని చెప్పారు. ప్రాంతీయ సమాచార ఇంజనీర్ కార్యాలయపు సూపరింటెండెంట్ అన్నమ్మ మాట్లాడుతూ మల్లికార్జునరావు ఓ సున్నిత మనస్కుడే కాక, కార్యాలయ విధులపట్ల నిబద్ధత గల వ్యక్తి అని పేర్కొన్నారు. డివిజనల్ పీఆర్వో నారాయణ రావు మాట్లాడుతూ, మల్లికార్జునరావు వృత్తి పట్ల అంకితభావంతో పాటు, సహోద్యోగులతో ఉన్న సహకార శైలితో కూడా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ బాలాజీ, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్ మాధవి, పీఆర్వో కిషోర్ , పాత్రికేయులు శ్రీనివాసరావు, భగవాన్ తదితరులు మల్లికార్జునరావు సేవలను కొనియాడారు. అనంతరం మల్లికార్జునరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రాష్ట్ర సమాచార కేంద్రం, ప్రాంతీయ సమాచార ఇంజనీర్ కార్యాలయం, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోన్–2 పరిధిలో జూన్ 2న తాగునీటికి అంతరాయం

జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వాక ఇంజనీర్ సుధాకర్

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్–2 వార్డ్ నెం.6, 7 పరిధిలో జూన్ 2వ తేదీన తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ శనివారం పత్రికా ప్రకటన ద్వారా శనివారం తెలియజేశారు. జి.వి.యం.సి. జోన్–2, వార్డ్ నెం. 6, 7 పరిధిలో గల త్రాగు నీటిని సరఫరా చేయు ప్రధాన వనరు అయిన గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ నుండి తాగునీటిని పంపింగ్ చేయు ప్రధాన 700 ఎం.ఎం.డయా పైప్ లైన్ మారికవలస ఎం.ఆర్.ఎఫ్ టైర్స్ షోరూం దగ్గర లీకులకు గురికావడము వలన మరమత్తులు చేయు నిమిత్తము నీటి పంపింగ్ నిలుపుదల చేయడమైనదని, అందువలన తేది.02-06-2025 అనగా సోమవారం త్రాగు నీటిని సరఫరా చేయుటకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. జోన్–2 వార్డ్ నెం. 6 యందు కొమ్మాది విల్లేజ్, ఎం ఎస్ ఆర్ లే అవుట్, సాయి ప్రియ లే అవుట్,సంపత్ నగర్, లక్షివాని పాలెం యస్.సి. కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్ళపాలెం. పి.యం. పాలెం, అశోక్ నగర్, తులసి నగర్, వార్డ్ నెం.7 యందు చంద్రం పాలెం, కళానగర్, కృష్ణ నగర్, యన్.జి.ఓస్ కాలనీ, వుడాకాలనీ మొదలగు ప్రాంతములలో త్రాగునీటి సరఫరాకు అంతరాయము కలుగునన్నారు. ప్రత్యమ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయబడునని, కావున సదరు అంతరాయానికి ప్రజలు సహకరించవలసినదిగా జీవీఎంసీ కమిషనర్ తరపున కోరడమైనదని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు.

జనరల్ నాలెడ్జ్ వల్ల ప్రాపంచిక జ్ఞానం పెరుగుతుంది

విశాలాంధ్ర–మల్కాపురం : జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల మన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల ఒక అవగాహన ఏర్పడుతుందని యువజన నాయకులు కె.బాలకిషోర్ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో శనివారం నాడు జనరల్ నాలెడ్జ్ కి సంబంధించిన అంశాలపై ఆయన శిక్షణ ఇస్తూ– జనరల్ నాలెడ్జ్ వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించగలమని అన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల, ప్రతిరోజు ప్రసారం అవుతున్న వార్తల పట్ల, బడ్జెట్ పట్ల జనరల్ నాలెడ్జ్ వల్ల అవగాహన పెరుగుతుందని ఆయన అన్నారు. మీడియా, జర్నలిజం, పబ్లిక్ సర్వీస్, బ్యాంకింగ్, విద్య మొదలైన రంగాలలో విజయం సాధించాలంటే జనరల్ నాలెడ్జ్ ఎంతో అవసరం అని ఆయన అన్నారు. భౌగోళిక శాస్త్రం పై మరియు చరిత్రపై జి.మధు అవగాహన కలిగించారు. ఈ జనరల్ నాలెడ్జ్ శిక్షణ పట్ల బాలలు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు.

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా బి.సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర–విశాఖపట్నం : ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్

గ్రీవన్స్ రెడ్రసల్ ఫోరం (సీ.జీ.ఆర్.ఎఫ్) ఛైర్మన్‌గా రెండవ పర్యాయం బి.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మాది ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. 2022 నుంచి 2025 వరకు కూడా సత్యనారాయణ సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్‌గా సేవలందించారు. కాగా రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో 1998 నుంచి 2022 వరకు 24 సంవత్సరాలు పాటు జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా జడ్జి హోదాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. ఆఖరిగా 2022లో జిల్లా జడ్జిగా పదవీ విరమణ చేశారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గత మూడేళ్లు ఆయన నిబద్ధతతో తీర్పులిచ్చారు. కాగా సత్యనారాయణ పునర్నియామకం పట్ల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ, ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబు (ఫైనాన్స్), సీజీఆర్‌ఎఫ్ సభ్యులు ఎన్.మురళీకృష్ణ (ఇండిపెంట్), ఎస్.సుబ్బారావు (ఫైనాన్స్), బి.సులేఖరాణి (టెక్నికల్) హర్షం ప్రకటించారు.

మహానాడు ద్వారా ప్రజలకు ఏం చెప్పారు...?

ప్రజలను వంచించడానికి ఏడాది తరువాత మరో ప్రయత్నం
శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

విశాలాంధ్ర–విశాఖ సిటీ : మహానాడు ద్వారా ప్రజలకు ఏం చెప్పారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో టీడీపీ అట్టహాసంగా నిర్వహించిన మహానాడు ఒక ప్రహసనంలా ముగిసిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు చేసిన మోసంను, ఏడాది పాలన తరువాత మరోసారి ఈ మహానాడు ద్వారా మోసం చేసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. మహానాడు ద్వారా ఈ రాష్ట్ర ప్రజలకు అధికార పార్టీగా తెలుగుదేశం ఏచెప్పిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది అసమర్థ పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, సభ్యత మరిచి దారుణమైన భాషతో వ్యక్తిగత దూషణలు చేసేందుకే మహానాడును పరిమితం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబుపత్రాలను కూడా సరైన విధంగా మూల్యాంకనం చేయించలేని స్థాయికి విద్యాశాఖను తీసుకువెళ్ళిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఈ చేతకాని ప్రభుత్వంలో విద్యార్థులకు సైతం దారుణమైన అన్యాయం జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. 20 మార్కులు వచ్చి ఫెయిల్ అయిన విద్యార్థికి రీవాల్యుయేషన్లో 90 మార్కులు వచ్చాయని, ఇలా 16వేలమంది రివాల్యుయేషన్‌కి వెళితే ఇందులో అధికశాతం మూల్యాంకణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు తేలిందన్నారు. ఈ వ్యవహారంపై బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి రీవాల్యుయేషన్ పై చర్చ జరుగుతుందన్నారు. విద్యా శాఖ అసమర్థత కారణంగా 10వ తరగతి విద్యార్థులు ఎంత క్షోభకు గురి అవుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. పదో తరగతి మూల్యాంకణపై సమీక్ష చేసుకున్నారా అని ప్రశ్నించారు.

పథకాలపై స్పష్టత ఏది.? : ప్రజలకు హామీ ఇచ్చిన పథకాలను ఎప్పుడు, ఏ తేదీల్లో అమలు చేస్తారో మహానాడు సాక్షిగా ఎందుకు చెప్పలేకపోయారని బొత్స టిడిపిని ప్రశ్నించారు. వైయస్‌ఆర్ జిల్లా పేరును వైయస్‌ఆర్ కడప జిల్లాగా మార్చుకున్నారు. మరి ఎన్టీఆర్ జిల్లాను ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా కూటమి ప్రభుత్వం మారుస్తుందా? ఈ రాష్ట్రానికి సేవలు అందించిన ముఖ్యమంత్రులకు ఇచ్చే గౌరవం ఇదేనా? ఇంత సంకుచితంగా సీఎం చంద్రబాబు ఎలా ఆలోచిస్తున్నారని నిలదీశారు. మహానాడులో రైతుభరోసా ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వంలోని వ్యవసాయశాఖ మంత్రి ఎందుకు ప్రకటించలేదు? అమ్మ ఒడి, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి ఇలా కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో తేదీలతో సహా ఎందుకు సంబంధిత మంత్రులు ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ఉర్సా కు ఎంతకు భూములు ఇచ్చారో బయట పెట్టాలని, కారు చౌకగా కట్టపెట్టారన్న మా ఆరోపణలను వాస్తవం కాదని దమ్ముంటే నిరూపించాలని సవాల్ చేశారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని ఎత్తి చూపుతూ జూన్ 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలను కలుపుకుని ఆరోజు నిరసనలు, ర్యాలీలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె.రాజు, సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ దొంగ అరెస్ట్... ఫోన్లు స్వాధీనం

విశాలాంధ్ర–విశాఖ క్రైమ్ : ద్వారకా నగర్ ఏరియాలోని బాయ్స్ హాస్టల్ లో ఉంటున్న గణేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది వివరాల్లోకి వెళ్తే కోన్విరి సోము రెడ్డి, అనే వ్యక్తి. ఒక సంవత్సరం నుండి శ్రీ చక్ర బాయ్స్ హాస్టల్ పేరుతో ద్వారకా నాగర్ ఏరియాలో బాయ్స్ హాస్టల్ నడుపుతున్నాడు, తేది 07-04-2025 ఉదయం గణేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి, హాస్టల్లో సెల్ ఫోన్ కనిపించడం లేదని తెలియజేశాడు. వెంటనే సోము రెడ్డి హాస్టల్ కి వెళ్లి హాస్టల్ బాయ్స్ తో మాట్లాడగా వారు కూడా హాస్టల్లో ఆరు సెల్ ఫోన్లు కనిపించడం లేదని తెలిపారు, నాగ్ బాయ్స్ హాస్టల్ పేరుతో ఉన్న మరో హాస్టల్ అదే భవనంలో ఉందని, ఆ హాస్టల్లో కూడా ఐదు సెల్ ఫోన్లు కనిపించడం లేదని గుర్తు తెలియని వ్యక్తులు రెండు హాస్టల్లలోకి చొరబడి 17 సెల్ ఫోన్లను దొంగలించారని సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు కేసు నమోదు చేసిన పోలీసులు నేరం జరిగిన రోజు నుండి ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ సిబ్బంది, హాస్టల్ లో సీసీ ఫుటేజ్ ఆధారంగా ముద్దాయి కనకం దామోదర్ అలియాస్ కార్తిక్ అలియాస్ దాము అలియాస్ రోహిత్ గా గుర్తించి తేది 27-5-2025, ద్వారకా నాగర్ వద్ద అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 12 సెల్ఫోన్లను మరియు సాంసంగ్ ట్యాబ్ ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ముద్దాయి కనకం దామోదర్ పై సుమారు 20 వరుకు సెల్ ఫోన్స్ కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్నాయని మీడియా సమావేశంలో పోలీస్ అధికారులు తెలిపారు.

జన భాగస్వామ్యం, రవాణా వసతిపై ప్రధాన దృష్టి సారించాలి

జిల్లా అధికారులతో సమీక్షించిన నోడల్ అధికారి డా.ఎ.మల్లికార్జున

విశాలాంధ్ర–విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ప్రజలు భాగస్వామ్యమయ్యేలా పక్కా చర్యలు చేపట్టాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, యోగా ఉత్సవాల మొబలైజేషన్, ట్రాన్స్ పోర్టు నోడల్ అధికారి డా. ఎ. మల్లికార్జున జిల్లా అధికారులకు సూచించారు. ఏర్పాట్లను పర్యవేక్షించే నిమిత్తం శనివారం జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ కె. మయూర్ అశోక్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ లతో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ బీచ్ రోడ్డులో ఎంత మంది ఆశీనులు కాగలరు, అదనపు వేదికల్లో ఎంత మంది ఆశీనులు కాగలరు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ప్రతి 24 చ.అడుగులకు ఒక్కరి చొప్పున యోగాసనాలు వేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలను తీసుకొచ్చే వాహనాల నిర్వహణలో పక్కాగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ పరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంపార్ట్మెంట్ వారీగా బస్సులను కేటాయించాలని, ఆయా వాహనాలకు గుర్తించిన ప్రదేశాల్లో పార్కింగు వసతి కల్పించాలని సూచించారు. వాహనాల రాకపోకల విషయంలో గందరగోళం తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నోడల్ అధికారి సూచించారు. జిల్లాలో చేపట్టిన చర్యలను మ్యాపుల సాయంతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. జేసీ, ఈపీడీసీఎల్ సీఎండీతో పాటు భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘనంగా సత్కారం

ప్రపంచ పటంలో క్రీడల్లో విశాఖ తన స్థానాన్ని పదిలం చేసుకుంటుంది : వక్తలు

విశాలాంధ్ర–విశాఖపట్నం : క్రీడలతో వ్యక్తిలో క్రమశిక్షణ అలబడుతుందని తద్వారా వారు సమాజానికి అత్యుత్తమ మానవ వనరులుగా నిలుస్తారని పలువురు శాసనసభ్యులు అన్నారు. శనివారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీగా ఎంపికైన డాక్టర్ డి. భగీరథ కుమార్, ఐ సి ఎ ఐ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన డి.ప్రసన్న కుమార్ ల సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యుల గణబాబు మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని అన్నారు. ప్రపంచ పటంలో క్రీడల్లో విశాఖ తన స్థానాన్ని పదిలం చేసుకుంటుంది అని అన్నారు. యువత విద్యతోపాటు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. తద్వారా రాష్ట్రానికి, దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం సాధ్యపడుతుందని అన్నారు. నగరానికి చెందిన భగీరథ కుమార్, ప్రసన్నకుమార్ లు జాతీయస్థాయిలో ఉన్నత పదవులను అందుకోవడం నగరానికి ఎంతో గర్వకారణం అని అన్నారు. విశాఖ నగరానికి, తాము చేపట్టిన పదవులకు మరింత పేరు తెచ్చే విధంగా కృషి చేయాలని పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష అన్నారు. ఉన్నతంగా ఎదిగిన ఇటువంటి వ్యక్తులను సన్మానం చేయడం వలన చిన్నారుల్లో స్ఫూర్తిని పెంపొందించడం సాధ్యపడుతుందని అన్నారు. చిన్నారుల విజయం వెనుక తల్లిదండ్రుల కృషి ఉంటుందన్నారు. అనంతరం భగీరథ కుమార్, ప్రసన్న కుమార్ లను సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ చంద్ర, కార్యదర్శి శీలం లక్ష్మణ్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి తామస్ అయ్య, కళాభారతి కార్యదర్శి డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరులో వీఎంఆర్డీఏ రోడ్ షో

విశాలాంధ్ర–విశాఖ : మధురవాడలోని (మధురవాడ హైట్స్) 87.80 ఎకరాల భూమిని సంయుక్తంగా అభివృద్ధి చేయడంపై బెంగుళూరులో వీఎంఆర్డీఏ అధికారులు శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు గోద్రెజ్ ప్రాపర్టీస్, ఉషా శ్రీరామ్ ప్రాపర్టీస్, స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొన్నాయి. కొన్ని సంస్థలు సూచనప్రాయంగా తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయని జాయింట్ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. ఈ రోడ్ షోలో ప్రధాన చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, నిర్వాహకులు నైట్ ఫ్రాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పదవీ విరమణ సన్మానసభ

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ఉద్యోగులు శ్రీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, సత్యారావు శనివారం పదవి విరమణ సన్మాన సభ జరిగింది. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం కుటుంబ సభ్యులనుతో స్వామివారి దర్శనం చేయించి కళ్యాణ మండపము నందు సన్మాన సభ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్.ఆనందకుమార్ పిల్లా శ్రీనివాసరావు డిప్యూటీ ఇంజనీర్, రామరాజు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. ఈ సన్మాన సభకు ఆలయ పర్యవేక్షణ అధికారులు రాజ్యలక్ష్మి పాలూరు నర్సింగరావు త్రిమూర్తులు ఏఈ తాతాజీ బంగారు రాజు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : మూడు శతాబ్దాల క్రితం ఇండోర్ సామ్రాజ్యాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దిన అహల్యా భాయి హెూల్కర్ అడుగుజాడల్లో ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని బిజెపి బీసీ నేత మూల వెంకటరావు పేర్కొన్నారు. అహల్యా భాయి హెూల్కర్ 300 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పరుశురాం రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అహల్యాబాయి పరిపాలన దక్షతను ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రజలతో మమేకమై పని చేసే విధానాన్ని వివరించారన్నారు. 1725 మే 31న మహారాష్ట్రలోని చౌండీ గ్రామంలో సుశీల మనకోజిసిండే దంపతుల కుమార్తెగా పుట్టిన ఆమెకు 8 ఏళ్ల వయసులోనే భాండేరావు హెూల్కర్ తో వివాహం జరిపించారని వెల్లడించారు. 1754 లో యుద్ధంలో భర్త మరణించడంతో అహల్యాబాయి సతీసహగమనానికి ప్రయత్నించగా ఆమె మామగారు అడ్డుకొని ఆదరించారని తెలిపారు. ఆ తర్వాత తక్కువ కాలంలోనే కూతురు కొడుకు మనవడు అందరూ యుద్ధంలో మరణించినప్పటికీ చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఇండోర్ సామ్రాజ్యాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. అనేక హిందూ దేవాలయాలను నిర్మించడంతోపాటు పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టి హైందవ జాతి అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. అహల్యా భాయి అడుగుజాడల్లో పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భీ, విరాసిత్ భీ నినాదంతో ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా భారత దేశాన్ని తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నభూతో న భవిష్యత్తు గా సాగుతున్నాయని పేర్కొన్నారు.

పెందుర్తి : పుణ్యశ్లోక అహల్య భాయ్ హెూల్కర్ 300 వ జయంతి

కార్యక్రమాన్ని పెందుర్తిలోని స్కిల్ డెవలప్మెంట్ శిక్షణా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గం బిజెపి కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులు స్థానిక నాయకులు అహల్య భాయ్ హెూల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాము నాయుడు మాట్లాడుతూ అహల్య భాయ్ హెూల్కర్ దేశంలో అనేక హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయడం ద్వారా సేవ, ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మికతకు ఎనలేని కృషి చేసారని తెలిపారు. అహల్య భాయి చేసిన కృషికి భారత ప్రభుత్వం ఆమె పేరుమీద స్త్రీ శక్తి పురస్కారాన్ని నెలకొల్పారని వెల్లడించారు. 8 ఏళ్ల వయసులోనే అహల్యా భాయికి వివాహం జరగ్గా తక్కువ కాలంలోనే భర్త కొడుకు కూతురు మనవడు యుద్ధంలో మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. అయినా ఏమాత్రం చెక్కుచెదరకుండా ఇండోర్ సామ్రాజ్యాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఈ జయంతి కార్యక్రమంలో బిజెపి మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ సిబ్బంది 120 మంది మహిళలు పాల్గొన్నారు.

అనందపురం: మండలంలో ఈ మహారాణి అహల్యా బాయ్ హెూల్కర్ 300వ జయంతి పురస్కరించుకొని పెద్ది పాలెం

గ్రామంలోని కాశీ విశ్వేశ్వర దేవాలయం నందు ఈ కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పిల్లా విజయ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బిజెపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ ముఖ్య అతిథిగా బిజెపి విశాఖజిల్లా పార్లమెంట్ కన్వీనర్ సరిపల్లి రామ్మోహన్ హాజరయ్యారు వారు మాట్లాడుతూ రాణి హోలియా భాయ్ హెూల్కర్ మొఘలాలలో దాడుల్లో దెబ్బతిన్న సోమనాథ్, కాశి విశ్వేశ్వర దేవాలయలను పునర్దించారని, అప్పట్లో 16 కోట్ల రూపాయలు ఖర్చుతో 12 జ్యోతి లింగాల క్షేత్రాల్లో ఆలయాలు నిర్మాణం చేశారని, వరకట్నానికి వ్యతిరేకంగా కఠిన చట్టాలు చేశారని మహిళలకు విద్య హక్కు చట్టం కల్పించారని వారు జీవిత చరిత్ర గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు విశాఖ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, భీమిలి నియోజకవర్గం కో - కన్వీనర్లు కె.సునీత,వి. శ్రీనివాసరావు,బిజెపి నాయకులు కామేష్,మీసాల రాము నాయుడు ఆనందపురం మండల ప్రధాన కార్యదర్శిలు డి.పి.రాజు,పోతిన జీవన సంతోష్, మండల బిజెపి నాయకులు పిల్లా సూర్య నారాయణ,అద్దురు ఆనంద్ ఇల్లి పిల్లి వెంకట్,(వర్షం వెంకట్) సుధాకర వర్మ,కె.వి.వి. కృష్ణారావు (గోపి) తాటిశెట్టి భాను మల్లారపు కృష్ణ,ఉప్పాడ శివ,నిమ్మకాయల అప్పలరాజు,పిల్లా చిన్నా రావు శీల రాజు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో శేష జీవితం ఆనందంగా గడపాలి

జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర-విశాఖపట్నం : జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది లాంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హెూదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న 12 మంది జీవీఎంసీ అధికారులను, ఉద్యోగులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి దా.ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు పద్మజ, అప్పలనాయుడుతో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారు జీవిఎంసిలో సుదీర్ఘకాలం ప్రజల కొరకు ఎన్నో సేవలు అందించారని, రోజులో తన కుటుంబం కంటే తమ సంస్థ కొరకు అంకితమై సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని వారి విధుల నిర్వహణను కొనియాడారు. సుదీర్ఘ కాలం మనతో విధులు నిర్వహించి నేడు విధులను విడిచి వెళుతున్నందుకు సహతోటి ఉద్యోగులందరికీ భాధ కలుగుతుందన్నారు. పదవి విరమణ పొందిన తర్వాత ప్రతి ఒక్కరూ ఖాళీగా ఉండకుండా తమ ఆరోగ్యం కొరకు, సమాజ సేవ కొరకు ఏదో పని కల్పించుకోవాలని సూచించారు. అనంతరం ప్రధాన వైద్యాధికారి డా.ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి జీవీఎంసీ ఉద్యోగులు పనిచేస్తున్నారని ఉదయం నుండి రాత్రి వరకు రోడ్లపై, కార్యాలయాలలో పనిచేసి ప్రజలకు అనేక సేవలు అందించారని అటువంటి ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినప్పుడు వారిని సగౌరవంగా జీవిఎంసి గౌరవించడం మన సాంప్రదాయం అన్నారు. అలాగే మన కింద పని చేసే వారికి మీ సూచనలు సలహాలు అందించాలన్నారు. అనంతరం అదనపు కమీషనరు డి.వి.రమణ మూర్తి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులైన ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.స్వర్ణరాణి, రికార్డు అసిస్టెంట్లు ఎమ్.బాలక్రిష్ణ, టి.సుబ్రమణ్యం, పి.హెచ్.మేస్త్రీలు ఆర్.సూర్యరావు, జె.సుధాకార్, పి.హెచ్.వర్కర్లు ఎస్.రాజేశ్వరి,

ఎ.జనార్ధనరావు, ఎమ్.టి.ఎస్ జి.ధర్మారావు, బాల్యం టీచరు సి.హెచ్.సుభా నాగమణి, సి.ఒ(హెచ్.ఆర్) పోలసీ ఎమ్.నారాయణరావు, మజ్దూరు పి.క్రిష్ణ లకు 98 లక్షల 02 వేల 148 రూపాయల ప్రావిడెంట్ ను అందించి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఏపిడబ్ల్యూఈఎంఎస్ మరియు జేమ్స్ జనరల్ సెక్రెటరీ ఏ అప్పలరాజు, స్పోర్ట్స్ డైరెక్టరు రాజు, సూపరింటెండెంట్లు సన్ని, రియాజ్, ఇతర అధికారులు, ఉద్యోగులు, పదవి విరమణ పొందిన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిమ్సర్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం

విశాలాంధ్ర-మధురవాడ : ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా, గీతం మెడికల్ సైన్సెస్ & రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (జిమ్సర్) సామాజిక వైద్య విభాగం, గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రితో కలిసి ఉచిత నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని, పొగాకు వలన కలిగే అనర్థాలపై చర్చా గోష్ఠిని శనివారం తేది.31.05.2025న నిర్వహించింది. స్థానిక పెద జాలరిపేటలోని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పొగాకు వినియోగానికి సంబంధించిన హానికారక ప్రభావాలపై అవగాహన పెంపొందించడంతో పాటు నోటి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యులు ప్రజలకు వివరించారు. ఈ శిబిరంలో భారీ సంఖ్యలో స్థానికులు ఉచిత నోటి పరీక్షలు, పొగాకు విరమణ సలహాలను పొందారు.వైద్య నిపుణులు, డెంటిస్టులు, వైద్య విద్యార్థులు పాల్గొని ప్రపంచవ్యాప్తంగా పొగాకు నియంత్రణ మరియు క్యాన్సర్ నివారణ పిలుపునిచ్చారు.

పొగాకు వినియోగ నియంత్రణకు బహుశాఖల సమన్వయం : పొగాకు మరియు నికోటిన్ ఉత్పత్తుల ద్వారా కలిగే అనర్థాలనుంచి ప్రజలను బయటకు తీసుకు రావాలంటే వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని గీతం మెడికల్ సైన్సెస్ %ట% రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (జిమ్సర్)లో శనివారం జరిగిన చర్చాకార్యక్రమంలో నిపుణులు అభిప్రాయ పడ్డారు. ఈ చర్చలో న్యాయ నిపుణులతో పాటు బిజినెస్ మరియు మెడిసిన్ రంగాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొన్నారు. పొగాకు మరియు నికోటిన్ పరిశ్రమలు ప్రజల అవగాహనను ఎలా మోహవరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి, నియంత్రణల్లో ఉన్న లోపాలను ఎలా వినియోగిస్తున్నాయి, మరియు ముఖ్యంగా యువతను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నాయన్న అంశాలపై వారు చర్చించారు.

ప్యానెల్ సభ్యులుగా గీతం లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.అప్పలరాజు, గీతం బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మధుస్మితా చౌదరి, జిమ్సర్ రెస్పిరేటరీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. దాసరి నిఖిలా దోరా, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. గోవిందరాజు పాల్గొన్నారు. పొగాకు కంపెనీల మార్కెటింగ్ వ్యూహాలు మరియు కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు, యువతలో వేగంగా పెరుగుతున్న వెపింగ్ అలవాట్ల వల్ల వచ్చే ఆరోగ్య ప్రమాదాలు, నూతన తరహా పొగాకు ఉత్పత్తుల నియంత్రణలో ఉన్న విధాన లోపాలు, ధూమపాన వల్ల పిల్లల

ఆరోగ్యంపై పడే దీర్ఘకాలిక ప్రభావాలు, పరిశ్రమ మోసపూరిత వ్యూహాలను ఎదుర్కొనడానికి అవసరమైన చట్టపరమైన మరియు ఆరోగ్య సంరక్షణ చర్యలు చర్చించారు.ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ పొగాకు నియంత్రణ కేవలం ఆరోగ్య సమస్య కాదని న్యాయ, సామాజిక మరియు ఆర్థిక అవసరం అన్నారు. పొగాకు పరిశ్రమ కొత్త వ్యూహాలను ఎదుర్కొనడానికి బహుశాఖల సమన్వయం మరియు బలమైన విధాన పోరాటం అవసరమని వారు స్పష్టం చేశారు.

పెద్ద వయసు వారిలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : జాతీయ క్యాన్సర్ సర్వైవర్స్ దినోత్సవాన్ని భారతదేశం జరుపుకుంటున్న వేళ, పెద్ద వయస్సు వ్యక్తులలో పెరుగుతున్న క్యాన్సర్ భారం ఆందోళన కలిగిస్తోందని పలువురు వైద్యులు ఆందోళన వ్యక్తపరిచారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా, ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలలో పెద్ద వయస్సు వారిలో క్యాన్సర్ ప్రాబల్యం క్రమంగా పెరిగింది, ఇప్పుడు ఇది జాతీయ సగటు కంటే నాలుగు రెట్లు ఎక్కువగా దీని ప్రాబల్యం కనిపిస్తోందని అంచనా వేయబడింది. పెద్ద వయసు రోగులు తరచుగా కోమార్బిడిటీలు, నయం కావటానికి ఎక్కువ సమయం తీసుకోవటం మరియు శస్త్రచికిత్స ప్రమాదాలు పెరగటం వంటి అదనపు అవరోధాలను ఎదుర్కొంటున్నందున, ఈ ధోరణి వైద్యులకు కీలకమైన సవాలును అందిస్తుంది.

విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్ వద్ద, ఇటీవల జరిగిన రెండు విప్లవాత్మక శస్త్రచికిత్సలు ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద వయసు రోగులకు రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స పద్ధతులు క్యాన్సర్ చికిత్సను ఎలా మారుస్తున్నాయోనొక్కిచెప్పాయి. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 77 ఏళ్ల వ్యక్తికి రాష్ట్రంలోనే తొలిసారిగా రోబోటిక్ సహాయంతో ప్యాంక్రియాటికోడ్యుడెనెక్టమీ చేశారు. ఇది క్లోమం యొక్క తల, చిన్న ప్రేగు (డుయోడెనమ్) యొక్క భాగం, పిత్తాశయం మరియు పిత్త వాహికను తొలగించే అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స. ఓపెన్ సర్జరీ తో కలిగే రికవరీ భారం, అధిక ప్రమాదం కారణంగా ఈ ప్రక్రియ సాధారణంగా పెద్ద వయసు రోగులలో నివారించబడుతుంది. అయితే, అధునాతన దా విన్సీ టెక్నాలజీని ఉపయోగించి రోబోటిక్ విధానం తో చేసిన శస్త్రచికిత్స కారణంగా , రోగి కేవలం ఏడు రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యాడు, అతనికి శస్త్రచికిత్స సంబంధిత సమస్యలు ఏమీ రాలేదు. ఓపెన్ సర్జరీతో పోలిస్తే, ఇప్పుడు చురుకుగా మరియు నాణ్యమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఓపెన్ సర్జరీ కారణంగా కోలుకోవటానికి సాధారణంగా ఈ తరహా శస్త్రచికిత్సలో 2%-%3 వారాలు పట్టవచ్చు. "సాంకేతికత ఆధారిత క్యూరేటివ్ సర్జరీలను పెద్ద వయసు రోగులకు అందుబాటులో ఉంచడంలో మనం ఎంత దూరం వచ్చామో ఈ కేసు ప్రతిబింబిస్తుంది" అని విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు రోబోటిక్ సర్జరీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బిశ్వబసు దాస్ అన్నారు. "రోబోటిక్ సహాయం, ఈ ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా, శరీరంపై కనీస ఒత్తిడితో అద్భుతమైన ఆంకోలాజికల్ ఫలితాన్ని సాధించడంలో కూడా మాకు సహాయపడింది" అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మరొక మొట్టమొదటి తరహా శస్త్రచికిత్స ప్రక్రియలో, అన్నవాహిక క్యాన్సర్‌తో బాధపడుతున్న 74 ఏళ్ల వ్యక్తి రోబోటిక్ అన్నవాహిక శస్త్రచికిత్స చేయించుకున్నాడు, ఇందులో క్యాన్సర్ పెరగటం అడ్డుకోవటానికి అన్నవాహికలోని ప్రధాన భాగాన్ని తొలగించడం జరిగింది. గతంలో కీమో రేడియేషన్ పొంది, నాడీ సంబంధిత కోమోర్బిడిటీలతో బాధపడుతున్న రోగికి, మొదట్లో వేరే చోట ఓపెన్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. బదులుగా, అతను అధునాతన డా విన్సీ టెక్నాలజీతో చేసే రోబోటిక్-సహాయక శస్త్రచికిత్సను ఎంచుకున్నాడు - ఇది సర్జికల్ బృందం ఐసిజి (ఇండోసైనిన్ గ్రీన్) ఫ్లోరోసెన్స్ఇమేజింగ్ సహాయంతో కణితిని ఖచ్చితంగా తొలగించడానికి వీలు కల్పించింది, ఇది వాస్తవ సమయంలో దృశ్య మార్గదర్శకత్వాన్ని అందించింది. అతను ఇప్పుడు క్యాన్సర్ కణితి రహితంగా ఉన్నాడు, వేగంగా కోలుకుంటున్నాడు. ఐసిజి వంటి అధునాతన సాధనాలు శస్త్రచికిత్స స్పష్టతను పెంచుతున్నాయని మరియు ప్రభావవంతమైన జోక్యాలను అనుమతిస్తున్నాయని డాక్టర్ దాస్ వెల్లడించారు.

సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ 'షైన్స్'ని విడుదల చేసిన ఐటీసీ

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే, వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కుకీ యొక్క మెరుపును సజీవంగా తెస్తుంది. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీ ని విడుదల చేసింది, ఇది దాని తాజా ఆవిష్కరణ గురించి వెల్లడిస్తుంది. రుచి, ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించబడిన , ఈ కుకీలోనోరూరించే వెన్న నింపబడింది, కుకీ కొరికిన ప్రతిసారీ మహెూన్నతమైన మరియు సంతృప్తికరమైన రుచిని అందిస్తుంది. దీనిలోని కరకరలాడే ఎనిమిది పొరలు ఒక ప్రత్యేకమైన, నోటిలో కరిగిపోయే అనుభవాన్ని సృష్టిస్తాయి, అసమానమైన ట్రీట్‌గా మారుస్తాయి. రోజువారీ స్నాక్స్ అనుభవాన్ని షైన్స్ మెరుగుపరుస్తుంది, ఇది పగటిపూట తినడానికి, టీ-టైమ్ క్షణాలను ఆస్వాదించటానికి సరైన అనుబంధంగా మారుస్తుంది. మామ్స్ మ్యాజిక్ ఒక టీవీసీని విడుదల చేసింది, ఇది తన బిడ్డ ఎదుగుదలలో ఒక తల్లి యొక్క తిరుగులేని మద్దతు సారాంశాన్ని అందంగా ఒడిసిపడుతుంది. ఈ చిత్రంలో, నదియా మొయిదు ఒక తల్లి పాత్రను పోషించారు. ఆమె క్రంచీ బటర్ కుకీపై సున్నితమైన చక్కెర గ్లేజింగ్‌ను వర్తింపజేయడం వల్ల దానిలోని మెరుపు ఎలా బయటపడుతుందో అందముగా తెలియజేస్తారు. అదేవిధంగా, చెన్నైలో చెస్ శిక్షణ పొందాలనే తన కుమార్తె కలను నెరవేర్చడానికి మద్దతు ఇవ్వడం , దానికోసం తమ మామగారిని సున్నితంగా ఒప్పించడం, తద్వారా ఆమె తన బిడ్డ సామర్థ్యాన్ని వెలికి తీసుకురావటానికి కృషి చేయటం దీనిలో కనిపిస్తుంది. తమ పిల్లలలోని ఉత్తమతను బయటకు తీసుకురావడానికి అదనపు కృషి చేసే తల్లులకు ఈ టీవీసీ ఒక నివాళి అని ఈ ఆవిష్కరణ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు.

ఏషియన్ పెయింట్స్ 'కామ్యాబీ కే రంగ్' సీజన్ ఆరులో విశాఖ వ్యక్తి విజయగాథ

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఏషియన్ పెయింట్స్ 'కామ్యాబీ కే రంగ్'లో విశాఖపట్నానికి చెందిన గణిరాజు సిరిపురం ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ' గణిరాజు సిరిపురం కథను 'కామ్యాబీ కే రంగ్' సీజన్ 6లో ప్రస్తుతించారు. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సింగిల్ మాట్లాడుతూ కామ్యాబీ కే రంగ్ అనేది ఒక సాధారణ క్యాంపెయిన్ మాత్రమే కాదని, వ్యక్తుల విజయాన్ని మనస్ఫూర్తిగా జరుపుకునే ఒక ఉత్సవం అన్నారు. చిన్న స్థాయిలో ఉన్న పెయింటర్లు, కాంట్రాక్టర్లు సమాజంలో ఎదగడం చూశామన్నారు. ఈ ప్రయాణం మాకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఇది ఒక బ్రాండ్‌గా కాకుండా, వాళ్లను నమ్మిన భాగస్వాములుగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హెూమ్స్ అకాడమీ దేశవ్యాప్తంగా దాదాపు తొమ్మిది లక్షల మందికి శిక్షణ ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు 21 లక్షలకు పైగా ట్రైనింగ్ సెషన్లు నిర్వహించిందన్నారు. ఈశిక్షణలోని పెయింట్ అప్లికేషన్, వాటర్‌ప్రూఫింగ్, ఉడ్ ఫినిషెస్, మెషినరీ వాడకం, కస్టమర్ సర్వీస్ ఉన్నాయన్నారు. ఏషియన్ పెయింట్స్ దృష్టిలో ఇది కేవలం స్కిల్ డెవలప్‌మెంట్ మాత్రమే కాదని, గౌరవం, విశ్వాసం, అవకాశాల కోసం ఇది ఒక ప్రయాణం అన్నారు.

జూన్ 1 నుండి 5 జూన్ 2025 వరకు అమెజాన్ హెూమ్ షాపింగ్ స్ప్రీ

విశాలాంధ్ర-విశాఖపట్నం : అమెజాన్ డాట్ ఇన్ హెూమ్ షాపింగ్ స్ప్రీతో ఇంటికి వేసవి నవీకరణ చేసేలా నూతన ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. హెూమ్, కిచెన్, అవుట్ డోర్ ఉత్పత్తుల విస్తృత శ్రేణి ఎంపిక పై ప్రముఖ డీల్స్ ను అందిస్తోంది. రోబోటిక్ వాక్యూమ్స్ నుండి వాటర్ ప్యూరిఫైర్స్, కూలర్స్, వాటర్ బాటిల్స్, స్విమ్మింగ్ యాక్సరీస్, ఫర్నిచర్ మరియు ఇంకా ఎన్నో వాటి వరకు ఈ వేసవిలో మీరు సౌకర్యంగా మరియు చల్లగా ఉండటానికి అవసరమైన ప్రతిది కనుగొనండి. ఆక్వాగార్డ్, నార్వల్, వేగా, ఇంకా ఎన్నో వాటి పై జూన్ 1 నుండి జూన్ 5, 2025 వరకు ఉత్తేజభరితమైన డీల్స్ ను కస్టమర్లు ఆనందించవచ్చు. మరిన్ని ఆఫర్లు మరియు ఉత్పత్తులు తనిఖీ చేయడానికి ప్రముఖ భాగస్వామ్య బ్యాంక్స్ నుండి ఉత్తేజభరితమైన ఆఫర్లు బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా, ఫెడరల్ బ్యాంక్, హెచ్ ఎస్ బి సి, ఐడిఎఫ్సి, ఎస్ బ్యాంక్ లావాదేవీల పై 10 శాతం వరకు డిస్కౌంట్ ఉందని చెప్పారు.

అమేజాన్ పేతో బంపర్ రివార్డ్స్ : అమేజాన్ పే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ఉత్తేజభరితమైన రివార్డ్స్‌తోపాటు అపరిమితమైన 5శాతం (ప్రైమ్ కస్టమర్లు, 3 శాతం (నాన్-ప్రైమ్ సభ్యులు) క్యాష్ బాక్ పొందవచ్చున్నారు. ముఖ్యంగా, అర్హులైన కస్టమర్లు అమేజాన్ పే లేటర్‌తో రూ. 60,000 వరకు కూడా పొందవచ్చు. మరిన్ని తెలుసుకోవడానికి అమెజాన్ పేను సందర్శించాలని కోరారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాదరాజును సన్మానించిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితాన్ని ఆనందంగాను, ఆరోగ్యంగా గడపాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఉద్యోగ విరమణ పొందిన



జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద రాజును పలువురు కార్పొరేటర్లతో కలిసి ఘనంగా మేయర్ సన్మానించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఉద్యోగ విరమణ పొందినంతవరకు ప్రతి ఉద్యోగి అంచలంచెలుగా ఎదుగుతూ ఇంజనీర్లుగా, అధికారులుగా తను చేస్తున్న పనుల్లో భాగంగా ఎన్నో ఒడిదుదుకులకు, ఒత్తిడిలకు లోనవుతారని వాటినన్నింటినీ అధిగమించి ప్రజాసంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూ 62 ఏళ్ల పాటు ఉద్యోగం చేయడం ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పి.శివప్రసాద్ రాజు జీవీఎంసీ నందు ప్రధాన ఇంజనీర్ గా జీవీఎంసీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అందుకు సహకరించిన వారి కుటుంబ సభ్యులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి ఉన్నత అధికారిగా ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆనందదాయకంగానూ, ఆరోగ్యంగానూ ఉండాలని కోరుకున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్పొరేటర్లు బల్లా శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శరగడం రాజశేఖర్, గొలగాని వీరా రావు, బొండా జగన్నాథం, కొణతాల సుధా, గొలగాని పోలరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెంలో ఘనంగా కళ్యాణమండప శంకుస్థాపన

ముఖ్య అతిధులుగా 7వార్డు కార్పొరేటర్ దంపతులు



విశాలాంధ్ర-మధురవాడ : చంద్రంపాలెం గ్రామం కళ్యాణ మండప నిర్మాణశంకుస్థాపన కార్యక్రమం 7వవార్డు కార్పొరేటర్, పిల్లా మంగమ్మ,వెంట్రావు దంపతులు ముఖ్అతిధులుగా హాజరై శనివారంఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ఏడవ వార్డు పరిధి చంద్రపాలెం ఎన్జీవోఎస్ కాలనీ సమీపంలో చంద్రపాలెం కళ్యాణ మండపం కోసం కేటాయించిన స్థలంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించి దీనికిసంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రంపాలెంలో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారని, ఇరుకు రోడ్లు, నివాసాల మధ్య శుభకార్యాలు చేసుకునే పరిస్థితి లేదని. వర్షాలు పడినప్పుడు పరిస్థితి మరీ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్న విషయాన్ని గమనించి ప్రస్తుతం చంద్రంపాలెం ప్రజలు ఏకమై ఒకటిగా నిలిచి కళ్యాణ మండప నిర్మాణానికి నాంది పలకడం విశేషమని వారు పేర్కొనగా,ఆ కార్యక్రమాన్ని కార్పొరేటర్ దంపతుల చేతుల మీదుగా జరపటం తమకెంతో సంతోషంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రంపాలెం నాయకులు, ప్రజలు, సభ్యులుపాల్గొన్నారు. అనంతరం శంకుస్థాపన చేసిన స్థలంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాల కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

16వ బెటాలియంలో ట్రైనింగ్ క్లాస్ రూమ్ ప్రారంభం

విశాలాంధ్ర-పీఎం పాలెం : 16వ బెటాలియన్, బక్కన్నపాలెం, విశాఖపట్నంలో నూతనంగా పునరుద్ధరించబడిన (పునః నిర్మించిన) 16వ బెటాలియన్ ట్రైనింగ్ క్లాస్ రూమ్, లైబ్రరీ, గ్రౌండ్ వేదిక canopy , association రూమ్‌లను ప్రారంభోత్సవ వేడుక ద్వారా కమాండెంట్ కె.వి.మురళీ కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా విచ్చేసిన డా కె.శిల్ప మురళికృష్ణ, చేతుల మీదగా నూతనంగా నిర్మించిన 16వ బెటాలియన్ ఆఫీసర్ల బ్యాడ్మింటన్ మైదానాన్ని ప్రారంభించారు. అలాగే, ఈ కార్యక్రమంలో శ్రీకాకుళంలోని 1వ బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు కూడా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కమాండెంట్ కె.వి.మురళీ కృష్ణ, మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది ఉన్నతికి ట్రైనింగ్, లైబ్రరి సేవలు ఎంతగానో ఉపయోగపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ వి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్లు వి.నారాయణరావు, యన్.మురళీధర్‌లు యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఆర్.ఐ.లు, ఆర్.ఎస్.ఐలు, బెటాలియన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

రమేష్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-పెదగంట్యాద : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో 34 సంవత్సరాలు సుదీర్ఘంగా పనిచేసి ఈ నెల ముప్పాయి ఒకటన సీనియర్ జనరల్ ఫొరెమన్ గా ఉద్యోగ విరమణ చేస్తున్న కె రమేష్, కుమారి దంపతులను ఇన్స్టుమెంటేషన్ విభాగం ఉద్యోగులు అభినందించారు. కన్నయ్య ఆచారి రమేష్ సేవలు ప్రశాంసానీయం అన్నారు. 1991 నుండి ఇప్పటివరకు కోకోవెన్ ఇన్స్టుమెంటేషన్ విభాగంలో అలుపెరుగని యోధుడు పనిచేసి అందరితో ఆత్మీయుడు ల కలసిమెలసి పనిచేస్తూ, నవ్వుతు, నవ్విస్తూ అందరి హృదయాలను దోచుకున్న రమేష్ అభినందనీయుడు విభాగం ఉద్యుగులు తమ అభిప్రాయలను తెలిపారు. కోకోవెన్ విభాగం లో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశం లో పాల్గోని మాట్లాడుతు రిటైర్మెంట్ తధానంతర జీవితం ఆనందమయంగా, సుఖ సంతోషలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కోకోవెన్ ఇన్స్టుమెంటేషన్ ఉద్యోగులు, అధికారులు సిహెచ్ కనకరాజు, జివివి అన్నపరాజు, ఎం కె దుర్గ రావు, యేల్లేటి శ్రీనివాసరావు, ఉప్పిలి రామకృష్ణ, కె శ్రీరామ చంద్రరావు, ఎస్ ఏ రెహమాన్, ఐ ఎన్ రాజు, టి లక్ష్మణ రావు, ప్రకాష్ దిక్షీత్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

నేటి నుంచి డిపో వద్దనే రేషన్ పంపిణీ

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం స్థానిక తాసిల్దార్ కె ఆనందరావు తెలిపిన వివరాల మేరకు నేటి నుంచి డిపో వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని తెలియజేశారు. మండలంలోని సుమారు 38 రేషన్ డిపోలు ఉన్నాయని ఆయన అన్నారు. మండలం మొత్తం సుమారుగా 16741 రేషన్ కార్డులు ఉన్నట్లు తెలియజేశారు. ప్రతి రేషన్ డిపో ను పరిశీలించడం జరిగిందని , ప్రతి రేషన్ డిపో వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని నేటి నుంచి డిపో వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని,కావున లబ్ధిదారులందరూ వారికి అందుబాటులో ఉన్న రేషన్ డిపో వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలని తెలియజేశారు.